క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిధిలో పలు పాఠశాలల్లో గోపాలపట్నం సీఐ అశోక్ కుమార్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణ పాఠశాల, భాష్యం పాఠశాలల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. స్కూల్‌కు వచ్చి వెళ్లిన సందర్భాల్లో రహదారి దాటినప్పుడు ఇరువైపులా చూసి వాహనా రాకపోకలను గమనించాలన్నారు. బీఆర్‌టీఎస్ గ్రిల్స్‌పై నుంచి దూకి వెళ్లకూడదన్నారు. ఆటోల్లో ముందు సీట్లలో, వెనుక సీట్లలో కూర్చొని వెళ్లడం ప్రమాదకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పాఠశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టంగా డ్రైనేజీ పనులు చేపట్టాలి

విశాఖ విద్య: డ్రైనేజీలను పటిష్టపరిచేలా అభివృద్ధి పనులు చేపట్టాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52 వార్డు మర్రిపాలెం రైతుబజారు సమీపంలోని డ్రైనేజీ అభివృద్ధి పనులను జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌లో ఉన్న డ్రైనేజీపై మూత వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. జీవీఎంసీ ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు భవిష్యత్‌లో ఉపయోగకరంగా ఉండాలన్నారు. పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వాటిని నాణ్యతతో పాటు, సకాలంలో పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పర్యటనలో ఏఈ ఉష తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి పందిరిరాట మహోత్సవం



దుర్గాదేవికి పూజచేసి పందిరి రాట వేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో మునస ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పందిరిరాట వేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పలు వీధుల్లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన పల్లివీధి, గొల్లవీధి, మరడిమాంబ ఆలయం వద్ద గల కాలువల్లో పూడికలను గురువారం తొలగించారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్చార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి. అనురాధ, ఎస్. సతీష్, ఎమ్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్ పాల్గొన్నారు.

మెరుస్తున్న రహదారులు



జీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి గౌరీ నగర్‌కు సిమెంట్ రోడ్డు నిర్మాణం



అభివృద్ధి చేసిన మర్రిపాలెం వుడా లే అవుట్‌కు వెళ్లే ప్రధాన రహదారి

- భవిష్యత్ అవసరాల మేరకు పనులు
- 52వ వార్డులో మోడల్ రోడ్లు
- పశ్చిమలో రూ.80 కోట్లతో అభివృద్ధి
- రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం
- 52వ వార్డులో రూ.3.22 కోట్లతో రహదారుల నిర్మాణం

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని రీతిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి ఆడారి ఆనంద్ కుమార్ ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్‌గా, 52వ వార్డు కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్ నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా వ్యవహరిస్తొండడం కలిసొచ్చింది. ఉన్నతాధికారుల సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధికి వెల్లువలా నిధులు వచ్చిపడుతున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, మరో రూ.40 కోట్లతో మౌలిక సౌకర్యాలను కల్పిస్తున్నట్లు ఆడారి ఆనంద్ కుమార్ ప్రకటించారు. పనులు శరవేగంగా చేస్తున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి వైపు అడుగులు

ఎన్ఏడీ కూడలి అనుసంధానంతో ఉన్న పశ్చిమ నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. అటు గాజువాక,మరో వైపు పెందుర్తి, ఇటు ఉత్తర నియోజకవర్గాల్లోని కాలనీలకు సెంటర్ పాయింట్‌గా ఉన్న ఇక్కడ స్థిర పడేందుకు ఉద్యోగులు, వ్యాపారస్తులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనూ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీలు ఇక్కడ విరివిగా వెలుస్తున్నాయి. ఎన్ఏడీ కూడలి ప్రాధాన్యత దృష్ట్యా భవిష్యత్ అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

వార్డుల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీల్లో చిన్నపాటి రోడ్డు వేయాలన్నా, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగాల్సిన పరిస్థితులు ఉండేవి. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ప్రజావసరాలే కొలమానంగా అవసరమైన చోట్ల నిధులు మంజూరు చేస్తూ, రహదారుల నిర్మాణం చేపడుతున్నారు.

మెరుగుపడ్డ రహదారులు

జీవీఎంసీ 52వ వార్డును పరిశీలించినట్టయితే , ఇక్కడ రహదారుల నిర్మాణానికి రూ.3.22 కోట్లు కేటాయించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక కృషితో గతంలో ఎన్నడూ లేని రీతిలో రహదారుల నిర్మాణం చేపట్టారు. రూ.2.9 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర పది చోట్ల బీటీ రోడ్లు నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు.అదే విధంగా 0.55 కిలోమీటర్ల మేర రూ.49.65 లక్షలతో నాలుగు చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించారు. మరో రూ.72 లక్షలతో 5 చోట్ల సిమెంటు రోడ్లు నిర్మాణానికి టెండర్లు పిలిచారు. దీంతో వార్డు పరిధిలోని రహదారులన్నీ అద్దంలా మెరుస్తున్నాయి.

ప్రజల మన్ననలు పొందేలా పనులు



వార్డు ప్రజలు ఎంతో నమ్మకంతో కార్పొరేటర్‌గా గెలిపించారు. వార్డులో రోడ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ వంటి పనులు గతంలో ఎప్పుడు కూడా ఇలా జరుగలేదని కాలనీ వాసులు అంటుంటే ఎంతో ఆనందం ఉంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి ఆడారి ఆనంద్ కుమార్ సహకారం, జీవీఎంసీ అధికారుల సమన్వయంతో అభివృద్ధి చేస్తాం.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

శరవేగంగా అభివృద్ధి



టీడీపీ ప్రభుత్వంలో కాలనీలో ఓ చిన్న రోడ్డు వేయాలన్నా నాయకులను బతిమిలాడుకోవాల్సి వచ్చేది. నాడు ప్రజల గోడు పట్టించుకున్న వారే లేరు. కానీ ప్రజా సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన నాయకత్వంలో పనిచేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్ వంటి వారి సహకారంతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి జరిగింది.

– బీఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

అడగకుండానే అభివృద్ధి పనులు



ప్రజల సమస్యలు ఏంటో తెలుసుకొని, వాటికి పరిష్కారం చూపే నాయకులు ఉండటం సంతోషం. మాకిది కావాలని అడగాల్సిన అవసరం లేకుండానే, కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గతంలో ఎప్పుడు కూడా ఇలా రోడ్లు వేయలేదు. అందరి అవసరాల తీరేలా పనులు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– బి. నారాయణమ్మ, 52వ వార్డు

అభివృద్ధి పనుల పరిశీలన



వార్డులో పర్యటిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డులో పరిధి పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. ఈ వార్డులో ఎదురవానిపాలెం, ములగాడ, శ్రీరామ్‌నగర్, గుల్లలపాలెం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో సుమారు రూ.13 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. అలాగే మరో రెండు కోట్ల రూపాయలతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజలతో ఆయన కొంత సేపు ముచ్చటించారు. వార్డులో సమస్యలుంటే వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పశ్చిమ క్లస్టర్ -2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, గులిగిందల కృష్ణ, ధర్మల వేణుగోపాల్‌రెడ్డి, తోనంగి వెంకటరమణి, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,కోటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో పలువురి చేరిక



నూతన సభ్యులను సత్కరిస్తున్న షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు

సింథియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ సమావేశం గురువారం పార్టీ అధ్యక్షులు పీకేవీ రమణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సంస్థకు చెందిన ఐదుగురు సభ్యులు వెంకటరావు, సన్యాసిరావు, ఏ చిన్నా, కె.రాంబాబు, డి.శ్రీను, పీఎస్ఆర్ మూర్తిలను ఈ సందర్భంగా పలువురు సత్కరించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

మల్కాపురం : నిత్యం ప్రజా సంక్షేమం కోసం తపించే జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రానికి ఉండడం ప్రజలు చేసుకున్న అదృష్టం అని ఏపీ సూక్ష్మ చిన్న మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 58వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్, కుంచమ్మకాలనీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు వేల కోట్ల రూపాయలు ప్రజా సంక్షేమానికి ఉపయోగించారన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుండి పథకాలు అందకపోతే వార్డు సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు, అభివృద్ధినే నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, పశ్చిమ క్లస్టర్-2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలి



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్

దాబాగార్డెన్స్ : రైవాడ కెనాల్‌లో నీటిలో పని చేస్తున్న 105 మంది అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.15 నుంచి రూ.18,500కి జీతం పెంచాలని, అన్‌స్కిల్డ్‌గా పనిచేస్తూ పదేళ్ల అనుభవం ఉండి, ఐటీఐ సర్టిఫికెట్ కలిగిన 119 మందికి కూడా రూ.15 వేల నుంచి రూ.18,500కి జీతం పెంచేలా కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును వారి చాంబర్లలో కలిసి వినతిపత్రం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



గాయపడిన ఆదినారాయణను పరామర్శిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కె.ఆదినారాయణను జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఆదినారాయణ కాలికి గాయమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేరెడ్ల సత్యనారాయణ ఊటల్లి గోవిందు, త్రినాథరావు పాల్గొన్నారు.

వరలక్ష్మికి అభినందనలు



జిల్లా కార్యదర్శి వరలక్ష్మిని అభినందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బండారు వరలక్ష్మిని ఆ పార్టీ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అడారి ఆనంద్ కుమార్ అభినందించారు. ఈ మేరకు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో 92వ వార్డు పార్టీ కార్యకర్తలు, మహిళలు ఆయనను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, బండారు నాగేశ్వరరావు, దవల గోపాల్, దవల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న అశోక్ కుమార్ తదితరులు



పట్టాలు అందుకున్న ఫార్మా-డీ విద్యార్థులు

- నూతన ఔషధాలను అన్వేషించాలి
- ఘనంగా ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు

ఏయూక్యాంపస్ : ఫార్మా–డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ కోరారు. గురువారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అన్వేషణ జరిపే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా–డీ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఔషధాలకు సంబంధించిన చట్టాలపై ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కేవీ రమణ మూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వరకుమార్, ఏకేఎం పవార్, శైలజ పాల్గొన్నారు.

విందు అదిరింది..

కార్యక్రమాన్ని తిలకించడానికి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా విందును ఏర్పాటు చేశారు. తమ పిల్లలతో కలసి భోజనం చేసే విధంగా ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేసి, అరటి ఆకులో భోజనాలు వడ్డించారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ ఏయూ చేసిన ఈ ఏర్పాటు అందరినీ ఆకట్టుకుంది.

ఎకో వైజాగ్‌లో భాగస్వాములు కావాలి



కూరగాయల మొక్కలు, మట్టి పాత్రలు తీసుకెళ్తున్న మహిళలు



మొక్కలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

- పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి
- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎకో వైజాగ్'లో నగర వాసులంతా భాగస్వాములు కావాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. ఎన్ఏడీ కూడలి మర్రిపాలెం వుడా లేఅవుట్ కమ్యూనిటీ భవన్‌లో నిర్వహించిన 'ఐ సపోర్ట్ ఎకో వైజాగ్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మేడమిద్దె తోటలు పెంచే వారికి వంగ, టమాటో, పచ్చిమిర్చి నారు అందజేశారు. అదే విధంగా ఇంటి పరిసరాల్లో పక్షులకు ఆహారం, నీరు పెట్టే మట్టి పాత్రలను, పిచ్చుక గూళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు వీలైనన్ని చెట్లు నాటాలన్నారు.ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో కూరగాయలు, సుగంధ ద్రవ్యాల మొక్కలు పెంచుకోవాలన్నారు. ఇందుకోసం జీవీఎంసీ ఉద్యానవనశాఖ ద్వారా తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. అంతరించుకుపోతున్న పిచ్చుకలను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పిచ్చుకల సంరక్షణ కోసం ఇళ్ల వద్ద గూళ్లు ఏర్పాటు చేయటంతో పాటు, వాటికి నీటిని అందించేలా చూడాలన్నారు. 52వ వార్డుతో పాటు, పరిసర కాలనీల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పార్కుల ఏర్పాటుకు జీవీఎంసీ ద్వారా ప్రత్యేకనిధులు మంజూరుచేయిస్తున్నట్లు చెప్పారు. కాలనీలు సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వాటిని అభివృద్ధి చేసి పిల్లలకు, పెద్దలకు ఉపయోగకరంగా ఉండేలా మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ నిర్వాహకులు జేవీ రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు జియ్యాని మారుతి, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మిద్దెతోటలపై ఆసక్తి

మిద్దెతోటల పెంపకంపై అవగాహనకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చేపట్టిన వివిధ రకాల కూరగాయల మొక్కలు పంపిణీకి మర్రిపాలెం వుడా లేఅవుట్, పరిసర కాలనీ వారు ఎంతో ఆసక్తి కనబరిచారు. కూరగాయల మొక్కలు తీసుకునేందుకు అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. మిద్దె తోటల పెంపకంపై మహిళల్లో ఇటువంటి చైతన్యం రావడం మంచి పరిణామమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకునేలా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం'

గోపాలపట్నం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు గుణిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు 483 సచివాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం రామకృష్ణానగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పశ్చిమ సమన్వకర్త ఆడారి ఆనంద్ కుమార్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, ఊటపల్లి గోవిందు, రమేష్, సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వైద్య పరికరాల పంపిణీ



బీపీ,షుగర్ పరీక్షలు చేసే పరకరాలను అందిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న ఆశ వర్కర్లకు, ఏఎన్ఎంలకు బీపీ, షుగర్, రక్తహీనత సమస్యలను పరీక్షించే పరికరాలను కార్పొరేటర్ కొణతాల సుధ అందజేశారు. వైద్య పరికరాల కొరత ఉండడంతో ఈ విషయాన్ని కార్పొరేటర్ సుధ విషయం చెప్పగా.. ఆమె వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడడంతో వైద్య పరీక్ష కిట్లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో 345 సచివాలయ కన్వీనర్ బూస అప్పలరెడ్డి, చట్టి నూకరాజుయాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ఆళ్వార్ దాస్ జయంతి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు

గోపాలపట్నం: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో వాకర్స్ ఇంటర్నేషన్ సభ్యులు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆళ్వార్ దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలబాలికలకు పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి వాకర్స్ ఇంటర్నేషన్ జిల్లా గవర్నర్ శుభ జ్ఞాపికలు, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్, బాలికల పాఠశాల హెచ్‌ఎం ఎస్తేర్ హెప్సిబా, పీఈటీ కళావతి, అజంతా పార్క్ వెంకటాపురం ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్, అజంతా పార్క్ వనిత వాకర్స్ క్లబ్, ఎస్‌వీఎల్ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.